ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 14 ఆగస్టు 2024




అన్న క్యాంటీన్లు ప్రారంభం రేపు

శ్రీకాకుళం (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 13: జిల్లాలో గురువారం మూడు అన్న క్యాంటీన్లు ప్రారంభంకానున్నాయి. శ్రీకాకుళం నగరంలో రెండు (ఏడు రోడ్ల కూడలి, పాతబస్టాండ్ పొట్టిశ్రీరాముల మార్కెట్ జంక్షన్), పలాసలో ఒకటి ప్రారంభంకానున్నాయి. వీటిని మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా వంద క్యాంటీన్లను కూటమి ప్రభుత్వం ప్రారంభించనుంది. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం ఒక్కొక్కటి రూ.5 చొప్పున అందించనున్నారు. అన్న క్యాంటీన్లు ప్రారంభంకానుండడంతో పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏకమై సాగుతున్నారు

ప్రస్తుతం వ్యవసాయ రంగంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం ఎక్కువైంది. వాటి ధరలు ఏటా పెరుగుతుండడంతో రైతులకు పెట్టుబడి పెరుగుతోంది. పైగా దిగుబడులు తగ్గి నష్టాలు వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించారు ఆ గ్రామ రైతులు. తమకున్న చిన్నపాటి భూముల్లో తక్కువ పెట్టుబడితో సిరులు కురిపిస్తున్నారు. మార్కెట్లో ఈ పంటలకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో అధిక ఆదాయం అర్జిస్తున్నారు. ప్రకృతి సాగులో రాణిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్న పాలవలస గ్రామ రైతులపై ప్రత్యేక కథనం..

-(ఆమదాలవలస)



పాలవలస రైతుల ప్రకృతి సాగు

- సేంద్రియంలో రాణిస్తున్న పాలవలస రైతులు
- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
- ఆర్గానిక్ పంటలకు మార్కెట్లో డిమాండ్

బూర్జ మండలం పాలవలస గ్రామానికి చెందిన సుమారు 30 రైతు కుటుంబాలు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాయి. ఈ రైతులకు ఉన్న ఐదు, పది సెంట్ల భూమిని ఏకంగా ఐదు ఎకరాలుగా మార్చి అందరూ ఒకే మాటగా ప్రకృతి సేద్యం చేస్తున్నారు. దీనిద్వారా ఆకు కూరలు, కాయగూరలు, తదితర పంటలను సాగు చేస్తున్నారు. ఏడాదిలో కేవలం ఒక మే నెలలో విరామం తీసుకొని మిగిలిన 11 నెలలు కూడా వాతావరణానికి అనుకూలంగా సుమారు 20 రకాల ఆకుకూరలతో పాటు బీర, వంగర, దొండ, కాకర, చిక్కుడు, తదితర పంటలను పండిస్తున్నారు. వాటి మధ్యలో అంతర పంటలు కూడా సాగు చేసి అధిక ఆదాయం పొందుతున్నారు. ఈ పంటల సాగుకు పశువుల ఎరువు (గత్తం), జీవామృతం, ఘనామృతం, వేప కషాయం, వేప పిండి, తదితర సేంద్రియ ఎరువులను వినియోగిస్తున్నారు. ఆర్గానిక్ పంటలకు పాలకొండ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. మార్కెట్‌కు తీసుకెళ్లిన ఆకుకూరలు, కాయకూరలు క్షణాల్లో అమ్ముడు పోతాయి. దళారులను ఆశ్రయించకుండా నేరుగా మార్కెట్‌కు వెళ్లి అమ్ముకోవడం వల్ల ఆదాయం ఎక్కువగా వస్తుంది. వీరిని ఆదర్శంగా తీసుకొని బూర్జ, ఆమదాలవలస, సరుబుజ్జిలి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన రైతులు కూడా ప్రకృతి సాగుకు ముందుకు వస్తున్నారు. ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడ, చేపేపేట గ్రామాలకు చెంది పలువురు రైతులు సేంద్రియ ఎరువులతో చెరకు పండిస్తున్నారు. ఈ చెరకును గానుగ ఆడించి బెల్లం తయారు చేసి తిరుమల తిరుపతి దేవస్థానానికి పంపిస్తున్నారు. ఈ బెల్లాన్ని ప్రసాదం తయారీలో ఉపయోగిస్తున్నారు. ఆర్గానిక్ పంటలను సాగు చేస్తూ వ్యవసాయాన్ని లాభ సాటిగా మార్చిన పాలవలస రైతులను జిల్లా రైతాంగం ఆదర్శంగా తీసుకోవాలని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



టీటీడీకి పంపిస్తున్న ఆర్గానిక్ బెల్లం

అవగాహన కల్పిస్తున్నాం..

జిల్లాలో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ చేయించి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నాం. మండల, జిల్లా కేంద్రాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి సేంద్రియ సాగుపై మరింత అవగాహన కల్పిస్తున్నాం.

-సీహెచ్.చిన్నమ్మడు, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్, బూర్జ

ఏడాదికి రూ.40 వేల ఆదాయం వస్తుంది



గతంలో మా గ్రామానికి వ్యవసాయ అధికారులు వచ్చి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించినప్పటికీ మేము అంగీకరించలేదు. సాధారణ పద్ధతుల్లో పంటలను సాగు చేసి నష్టపోయేవాళ్లం. 2018 నుంచి ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించా. సమష్టి ప్రకృతి వ్యవసాయ సాగులో నా వాటాగా 20 సెంట్ల భూమి ఉంది. తక్కువ పెట్టుబడితో నా భార్య సహకారంతో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నా. పాలకొండ మార్కెట్‌లో ఆర్గానిక్ పంటలకు మంచి ఆదరణ లభిస్తుంది. ఏడాదికి సుమారు రూ.30వేల నుంచి రూ.40 వేల ఆదాయం వస్తుంది.

-లంక గణపతిరావు, పాలవలస

రైతులు ముందుకు రావాలి..



సేంద్రియ సాగుకు రైతులు ముందుకు రావాలి. దీనివల్ల భూమి సారవంతంగా మారడంతో పాటు నాణ్యమైన పంటలు పండుతాయి. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చు.

-ఎన్.ధనుంజయరావు, అడిషనల్ జిల్లా మేనేజర్, శ్రీకాకుళం

రెండు ఎకరాల్లో సాగు చేస్తున్నా..



నేను రెండు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. పచ్చిరొట్టకాయలతో పాటు 18 రకాల విత్తనాలను వేసి భూమిలో కలియదున్ని కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నా. గట్లపై మునగ, అరటి, కరివేపాకు పంటలు కూడా వేస్తున్నా. దీనివల్ల అధిక ఆదాయం వస్తుంది.

-సవిరిగాన రమేష్, పాలవలస

ప్రకృతి వ్యవసాయంతో లాభదాయకం..



నాకు ఎకరా పొలం ఉంది. గతంలో రసాయన ఎరువులతో వరి సాగు చేసేవాడిని. అధిక పెట్టుబడులు అయ్యేవి. వాతావరణం అనుకూలిస్తే పెట్టుబడులు మినహాయించగా కేవలం రూ.10వేల నుంచి రూ.15 వేల ఆదాయం వచ్చేది. ఇప్పుడు ప్రకృతి సాగు ద్వారా ఏడాదికి రూ.70వేల నుంచి రూ.80 వేల ఆదాయం వస్తుంది.

-తవిటినాయుడు, ప్రకృతి వ్యవసాయ రైతు

తొమ్మిదేళ్లుగా సాగు చేస్తున్నా..



తొమ్మిదేళ్లుగా నేను ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించి కొద్దిపాటి భూమిలో ఆకుకూరలు, కాయగూరలు తక్కువ పెట్టుబడితో పండిస్తున్నా. సొంతంగా పాలకొండ మార్కెట్‌లో అమ్ముకొని మంచి ఆదాయం పొందుతున్నా.

-పనస చిన్నప్పన్న, ప్రకృతి వ్యవసాయ రైతు

పంచాయతీలకు తీపి కబురు

- స్వాతంత్ర్య వేడుకల నిర్వహణకు నిధుల పెంపు
- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై సర్పంచ్‌ల హర్షం

హిరమండలం/ మెళియాపుట్టి, ఆగస్టు 13

గ్రామ పంచాయతీల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది పంద్రాగస్టు వేడుకలు నిర్వహించేందుకు నిధులు పెంచుతూ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సర్పంచ్‌లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 1,141 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి పంచాయతీలను నిర్వీర్యం చేసింది. వీటికి నిధులు కేటాయించకపోగా కేంద్రం మంజూరు చేసిన 14, 15 ఆర్థిక సంఘం నిధులను కూడా పక్కదారి పట్టించింది. గతంలో జెండా పండగకు 5వేలు జనాభాలోపు ఉన్న పంచాయతీలకు రూ.150, ఆపైన జనాభా కలిగిన పంచాయతీలకు రూ.250 మాత్రమే ఖర్చు చేసుకునే వీలుండేది. ఈ నిధులు కనీసం చాక్లెట్లు కొనడానికి కూడా సరిపోయేవి కాదు. దీంతో గత ప్రభుత్వ హయాంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిపిన దాఖలాలు లేవు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చిన్న పంచాయతీలకు రూ.10వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25 వేలు చొప్పున సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసుకునే వెసులుబాటు కల్పించింది. దీంతో సర్పంచ్‌లు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



హిరమండలం పంచాయతీ కార్యాలయం

ఘనంగా నిర్వహిస్తాం..



గత వైసీపీ ప్రభుత్వం స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించేందుకు నిధులు కేటాయించేది కాదు. దీంతో సర్పంచ్‌లు సొంత డబ్బులు వెచ్చించాల్సి వచ్చేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిధులను పెంచుతూ ఉత్తర్వులు ఇవ్వడం సంతోషంగా ఉంది. ఈ నిధులతో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం.

-దారపు డిల్లేశ్వరరావు, పాతపట్నం నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, ధనుపురం

ఆ 47 మందిని తక్షణమే తొలగించండి

- అరసవల్లి దేవస్థానంపై వస్తున్న వార్తలను చూస్తుంటే సిగ్గుగా ఉంది
- మాస్టర్ ప్లాన్ ఏమైంది?
- మంత్రి అచ్చెన్నాయుడు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

'అరసవల్లి ఆలయంలో అక్రమాలు జరుగుతున్నాయని ప్రతిరోజూ పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. వాటిని చూస్తుంటే సిగ్గుగా ఉంది. ఆలయంలో అనధికారికంగా విధులు నిర్వహిస్తున్న 47 మందిని తక్షణమే తొలగించాలి. మరలా నియామకాల్లో నిబంధనలు పాటించాలి.' అని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. కలెక్టరేట్‌లో శ్రీకాకుళం, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆదిత్యుని దేవస్థానానికి చెందిన భూములను లీజుకు ఇవ్వడంతో పాటు దుకాణాలకు వేలం పాట నిర్వహించి ఆదాయం పెంచుకోవాలని ఆదేశించారు. ఆలయానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ ఏమైందని అధికారులను ప్రశ్నించారు. వారు సరైన సమాధానం చెప్పలేకపోవడంతో తక్షణమే మాస్టర్‌ప్లాన్ రూపొందించి తీసుకురావాలని ఆదేశించారు. 'భక్తులు సమర్పిస్తున్న తలనీలాలు మాయమయ్యాయని వార్తలు విన్నా. వాటికి వేలం పాట ఎలా నిర్వహించారు. భద్రతగా ఉంచుకోలేక పోవడమేంటి. ఆలయంలో జరిగే ప్రతి విషయానికి ఈవోయే బాధ్యుడు. అక్రమాలు జరుగుతున్నాయని తేలితే చర్యలు తీసుకుంటాం. 25 ఎకరాల భూమికిగాను కేవలం రూ.2 లక్షలు మాత్రమే లీజు ద్వారా ఆదాయం లభించడమేంటి. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించాలి. శ్రీకాకుళం కార్పొరేషన్‌కు చెందిన విలువైన భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలి. శ్రీకాకుళం నగరం చుట్టూ ఔటర్ రింగు రోడ్డు నిర్మాణానికి గాను ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలి. కేంద్రమంత్రి ద్వారా నిధులు తెప్పించుకుందాం. కొవ్వాడ అణువిద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన నిధులు బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నారు. దానిద్వారా వచ్చిన వడ్డీని ఏవిధంగా ఖర్చు చేస్తున్నారో నాకు లెక్కలు చెప్పాలి. వడ్డీని ఇతరత్రా వాటికోసం ఖర్చుచేస్తున్నట్లు తెలిసింది. అణువిద్యుత్ ప్రాజెక్టుకు పునరావాసం కింద ఎంత నిధులు అవసరమో కలెక్టర్ ద్వారా నివేదిక ఇవ్వాలి. జిల్లాలో ఉచిత ఇసుకకు అడ్డంకులు ఎవరు సృష్టించినా చర్యలు తీసుకోవాల్సిందే. నాతోపాటు ఎమ్మెల్యేలు కలుగజేసుకున్నా వినవద్దు. ఉచిత ఇసుక పంపిణీ పక్కాగా ఉండాలి. శ్రీకాకుళం నగరం చుట్టూ ఔటర్ రింగురోడ్డు కోసం 542 ఎకరాలు అవసరమని తెలిసింది. డీపీఆర్ సిద్ధం చేయాలి. శ్రీకాకుళం నగరంలో రోడ్లు విస్తరణ చేపట్టాలి. పార్కులు, నదీతీర ప్రాంతాలను అభివృద్ధి చేసి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలి. శిల్పారామం ప్రాజెక్టును పునరుద్ధరించాలి.' అని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, ఇతర అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, పక్కన ఎమ్మెల్యేలు శంకర్, ఈశ్వరరావు

సమీక్షకు హాజరైన తొలగించిన ఉద్యోగి..

అరసవల్లి ఆదిత్యుని ఆలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించిన యుగంధర్ అనే వ్యక్తిని ఇటీవల తొలగించారు. అయితే, మంగళవారం మంత్రి నిర్వహించిన సమీక్షకు ఆయన హాజరయ్యారు. అనధికారికంగా నియమించిన వాళ్లందరినీ తక్షణమే తొలగించాలని సమీక్షలో మంత్రి ఆదేశించగా.. అదే సమీక్షలో యుగంధర్ పాల్గొనడం విశేషం. ఇలాంటి వారిపై ఆదిత్యుని ఆలయ అధికారులు ఎంతటి మక్కువ చూపుతున్నారో దీంతో తేటతెల్లమైంది.



రిమ్స్ కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న జూనియర్ వైద్యులు

రిమ్స్‌లో జూనియర్ డాక్టర్ల సమ్మె

- ఎమర్జెన్సీ సేవలు యథాతథం
- కోల్‌కతా ఘటనపై నిరసన

అరసవల్లి, ఆగస్టు 13: ఇటీవల కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థిని హత్యాచారానికి గురైన ఘటనకు నిరసనగా మంగళవారం రిమ్స్ కళాశాల ఎదుట జూనియర్ డాక్టర్లు సమ్మె చేపట్టారు. నిందితులకు మరణశిక్ష విధించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్లు డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు అత్యవసర సర్వీసులు మినహా మిగతా సేవలు నిలిపివేస్తున్నట్టు తెలిపారు. హత్యాచార ఘటనపై సీబీఐ విచారణ చేపట్టాలని, నేరస్తులకు మరణశిక్ష విధించాలని, వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తేవాలని, ఘటన జరిగిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేష్, కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎన్.మోహిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూతో విద్యార్థిని మృతి

కోటబొమ్మాళి, ఆగస్టు 13: మండలంలోని నిమ్మాడ కాలనీకి చెందిన కొంచాడ నీలమ్మ (22) అనే పీజీ విద్యార్థిని డెంగ్యూతో మంగళవారం మృతి చెందింది. నీలమ్మ పీజీ వరకు చదివి విజయనగరంలో పోటీ పరీక్షలు కోసం కోచింగ్ తీసుకుంటుంది. ఈనెల 1న ఇంటికి వచ్చిన ఆమెకు జ్వరం రావడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లింది. వైద్యులు పరీక్షలు నిర్వహించి ప్లేట్ లెట్స్ తక్కువగా ఉన్నాయని టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. టెక్కలి ఆస్పత్రికి వెళ్లగా అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు నీలమ్మను నరసన్నపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి డెంగ్యూ సోకిందని, భారీగా ప్లేట్‌లెట్స్ పడిపోయాయని, శ్రీకాకుళం రిమ్స్‌కు వెళ్లాలని సూచించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం నీలమ్మ మృతి చెందిందని తల్లిదండ్రులు హరి, యర్రమ్మ రోదిస్తున్నారు. నీలమ్మ ఒక్కరే సంతానం కావడంతో అల్లారు ముద్దుగా పెంచామని, కూలీనాలీ చేసి చదివించామని, ప్రయోజకురాలు అవుతుంది అనుకున్నలోపే తమకు దేవుడు అన్యాయం చేశాడని కన్నీటిపర్యంతమవుతున్నారు. నీలమ్మ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ విషయంపై నిమ్మాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్ వివ రణ కోరగా.. 'నీలమ్మ ఈనెల 10న చికిత్స కోసం ఆసుప్ర తికి వచ్చింది. రక్తపరీక్షలు నిర్వహించి ప్లేట్‌లెట్స్ 90వేలు ఉన్నాయని చెప్పాం. టెక్కలి జిల్లా ఆసుపత్రికి వెళ్లాలని సూచించాం. వారు టెక్కలికి వెళ్లలేదు.' అని తెలిపారు.



నీలమ్మ (ఫైల్)

రెవెన్యూ సదస్సులు వాయిదా

శ్రీకాకుళం (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 13: భూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16 నుంచి నిర్వహించాల్సిన రెవెన్యూ సదస్సులు వాయిదా పడ్డాయి. దాదాపు 45 రోజుల పాటు ఈ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీవోను జారీచేసింది. అయితే, అనివార్య కారణాలతో ఈ సదస్సులు సెప్టెంబరుకు వాయిదా పడ్డాయి. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గ్రహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు.

సోలార్‌తో విద్యుత్ సమస్యలకు
శాశ్వత పరిష్కారం

- వినియోగదారులు దరఖాస్తు చేసుకోవాలి
- ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ కృష్ణమూర్తి

అరసవల్లి ఆగస్టు 13: సోలార్ వ్యవస్థతో అన్ని విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ ఎన్.కృష్ణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. సోలార్‌తో నిరంతర విద్యుత్ సరఫరా సాధ్యపడుతుందని తెలిపారు. వినియోగదారులు పీఎం సూర్యఘర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్, పూర్తి పేమెంట్, పూర్తి సబ్సిడీ వివరాలను తెలుసుకోవచ్చన్నారు. సోలార్ రూఫ్ టాప్ కోసం అన్ని వివరాలను పొందుపరచిన అప్లికేషన్ సమర్పించాలన్నారు. దరఖాస్తుదారుడు ప్రస్తుత గృహ వినియోగ లోడ్ లేదా అంతకన్నా తక్కువ మాత్రమే వెబ్‌పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. కిలోవాట్స్‌కి సంబంధించిన చార్జీలు చెల్లించాలన్నారు. వెబ్‌పోర్టల్ నుంచి అనుమతి పొందిన తరువాత సోలార్ పరికరాల ఏర్పాటుకు సరఫరా దారుని ఎంచుకుని సబ్మిట్ చేయాలని తెలిపారు. అనుమతులు జారీ అయ్యాక విద్యుత్తుశాఖ అధికారులు సంబంధిత గృహాన్ని పరిశీలించి అను మతులు జారీ చేసి సోలార్ నెట్ మీటరు ఏర్పాటు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని గృహ విద్యుత్తు వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు. ఈ పథకం క్రింద ఇప్పటికి 147 మంది దరఖాస్తు చేసుకోగా 37 మందికి సోలార్ రూఫ్‌టాప్‌ను అందించినట్లు చెప్పారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం ఉన్నా టోల్‌ఫ్రీ నెంబరు 1912ను సంప్రదించాలన్నారు. ఈఈ టెక్నికల్ సురేష్ కుమార్, ఈఈ ఆపరేషన్స్ ఎస్.బయ్యానాయుడు, పథకం నోడల్ అధికారి బి.పెద్దినాయుడు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ ఎన్.కృష్ణమూర్తి

నవ్య చిత్రజ్యోతి
శ్రీకాకుళం • బుధవారం • 14 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com

షారూఖ్‌ను దాటిన పాపులారిటీ



ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ ఐఎండీబీ తాజాగా విడుదల చేసిన ఈ వారం అత్యంత ప్రజాధరణ పొందిన భారతీయ సెలబ్రిటీ జాబితాలో హీరోయిన్ శోభితా దూళిపాళ్ల పలువురు అగ్ర తారలను వెనక్కునెట్టి, రెండో స్థానం దక్కించుకున్నారు. షారూఖ్‌ఖాన్ ఆమె తర్వాతి స్థానంలో నిలిచారు. శార్వరీ అగ్రస్థానంలో నిలవగా, జాన్వీకపూర్ ఐదో స్థానంలో నిలిచారు. ఇటీవలే నాగచైతన్యతో శోభిత నిశ్చితార్థం జరిగిన నేపథ్యంలో నెటిజన్లు ఆమె గురించి తెలుసుకునేందుకు ఎక్కువగా సెర్చ్ చేశారు.

'మిస్టర్ బచ్చన్'ను గుర్తుంచుకుంటారు



రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీశ్ శంకర్ దర్శకత్వంలో టీ.జీ.విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ గురువారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవితేజ మాట్లాడుతూ "ఈ సినిమాలో మీరు కొత్త రవితేజను చూస్తారు. ఇందులోని ప్రేమకథ, పాటలు, యాక్షన్ ఎపిసోడ్స్ అద్భుతంగా వచ్చాయి. ఈ సినిమా థియేటర్లలో ఇరగదీస్తుంది. ప్రేక్షకులు చాలా కాలం గుర్తుంచుకుంటారు" అని చెప్పారు. "ఈ సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది. ఇది థియేటర్లలో ప్రేక్షకులతో విజిల్స్ వేయించే సినిమా. అనుకున్నదానికంటే బాగా వచ్చింది. దానిక్కారణం ఆయనంక బోస్ విజువల్స్ మిక్కీ.జే.మేయర్ సంగీతం. ఈ సినిమాకు రిపీట్ ఆడియెన్స్ ఉంటారు" అని దర్శకుడు హరీశ్ శంకర్ అన్నారు. "ఇది రవితేజతో నా మూడో సినిమా. ఈ సినిమాలో ప్రేక్షకులని ఆశ్చర్యపరిచే అంశాలు చాలా ఉన్నాయి. ఈ మాస్ ఎంటర్టైనర్ అందరికీ నచ్చుతుంది" అని నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ తెలిపారు.



తిరుమలేశుడి సేవలో జాన్వీకపూర్

ప్రముఖ నటి శ్రీదేవి కుమార్తె, బాలీవుడ్ యాక్టర్ జాన్వీ కపూర్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె తన స్నేహితుడు శిఖర్ పహారియాతో కలిసి మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. శ్రీదేవి జీవించి ఉండగా ఏటా తన పుట్టిన రోజు నాడు తిరుమల శ్రీవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందేవారు. జాన్వీకపూర్ ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)



సక్సెస్‌ను సెలబ్రేట్ చేద్దాం

నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించిన చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం మంగళవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ "సరిపోదా... చిత్రంతో ప్రేక్షకులకు మంచి సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది. మన సినిమా సక్సెస్‌ను థియేటర్లలో సెలబ్రేట్ చేద్దాం' అన్నారు. ఎస్. జే సూర్య మాట్లాడుతూ 'నాని గారి పాత్ర ఈ సినిమాలో ప్రతి శనివారం చేసే పనులు 'బాషా' చిత్రాన్ని గుర్తుకు తెస్తాయి' అన్నారు. సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందని డీవీవీ దానయ్య చెప్పారు.


గురుదక్షిణగా రూ. 300



ఖరీదైన బహుమతులే అవ్వాల్సిన పనిలేదు... మనసు అంతరాళలో నుంచి పొంగిపొర్లే ప్రేమను వ్యక్త పరిచేందుకు ఇచ్చే బహుమతులు చిన్నవే అయినా వాటి విలువ అమూల్యమే. సీనియర్ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ తను గురువుగా భావించే మహేశ్‌భట్‌కు కూడా ఇలాంటి బహుమతినే అందించి, ఆశ్చర్యపరిచారు. ఇటీవలే ముంబైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో మహేశ్‌భట్, అనుపమ్‌ఖేర్ వేదికను పంచుకున్నారు. తన సినీ ప్రయాణం గురించి వేదికపైన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు అనుపమ్‌ఖేర్. 'ఎవరైనా నా బయోపిక్ తీస్తే అందులో భట్ సాబ్‌ది ముఖ్యమైన పాత్ర అవుతుంద'ని ఆయన అన్నారు. అలా చెబుతూ వెంటనే తన జేబులో నుంచి రూ. 300 తీసి మహేశ్‌భట్‌కు అందజేసి, గురుదక్షిణగా స్వీకరించాలని కోరారు. మహేశ్‌భట్ ఆ నోట్లను సంతోషంగా స్వీకరించడమే గాకుండా వాటిని వేదికపైనుంచి అందరికీ చూపించి, జాగ్రత్తగా తన జేబులో దాచుకున్నారు. అనుపమ్‌ఖేర్ సినీ జీవితాన్ని మలుపుతిప్పిన చిత్రం 'సారాంశ్'. నటుడిగా ఆయనకు గొప్ప పేరు తెచ్చి కెరీర్‌లో నిలదొక్కుకునేలా చేసింది. 1984లో వచ్చిన ఈ చిత్రానికి మహేశ్‌భట్ దర్శకత్వం వహించారు.

సవాలుతో కూడుకున్న విషయం

తెలుగులోనూ మంచి పాపులారిటీ ఉన్న తమిళ సంగీత దర్శకుల్లో జి.వి.ప్రకాశ్ ఒకరు. ఆయన సంగీతం అందించిన లేటెస్ట్ చిత్రం 'తంగలాన్'. ఈ గురువారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. "ఇలాంటి పీరియాడికల్ ఫిల్మ్‌కు సంగీతం అందించడం చాలా సవాలుతో కూడుకున్న విషయం. ఇలాంటి నేపథ్యం ఉన్న సినిమాలకు పనిచేసే అవకాశం అరుదుగా వస్తుంటుంది. అందుకే ఈ చాన్స్ మిస్ చేసుకోవాలనుకోలేదు. ఒక సంగీత దర్శకుడిగా ఈ సినిమాకు పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చింది. ఈ సినిమాకు ఎలాంటి సంగీతం అందించాలనే విషయమై చాలా పరిశోధన చేశాను. దర్శకుడు పా.రంజిత్ విజన్ చాలా బాగుంటుంది. థియేటర్లలో పూనకాలు తెప్పించే సన్నివేశాలు సినిమాలో చాలా ఉన్నాయి. ఇప్పటికే రిలీజైన పాటలకి మంచి స్పందన వస్తోంది" అని చెప్పారు.



ధైర్యాన్ని నింపింది



నటుడిగా తొలి చిత్రం 'అలనాటి రామచంద్రుడు' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కృష్ణవంశీ. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం మంచి టాక్‌తో నడుస్తోంది. ఈ సందర్భంగా కృష్ణవంశీ మీడియాతో ముచ్చటించారు. "నా తొలి సినిమాకే ఇంతటి ప్రేక్షకాదరణ దక్కడం చాలా సంతోషంగా ఉంది. చాలా రోజుల తర్వాత ఓ స్వచ్ఛమైన ప్రేమకథను థియేటర్లలో చూశామని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ఈ విజయం టీమ్ అందరిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది" అని చెప్పారు.

ఐదు జంటల ప్రేమకథ



ఎం.ఎస్.వి సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఈనెల 29న విడుదలవుతోంది. హీరో ఆకాశ్ జగన్నాథ్ ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఐదు ప్రేమ జంటల మధ్య సాగే అద్భుతమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని దర్శకుడు చెప్పారు. శృతి శంకర్, విహారిక, అభిలాష్ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అరమాన్. సినిమాటోగ్రఫీ: ఎస్. ప్రసాద్.

డేట్ మార్చడమే 'స్త్రీ 2'కి కలిసొచ్చిందా?

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ గురువారం రెండు హిందీ చిత్రాలు విడుదలవుతున్నాయి. అవేమిటంటే.. అక్షయ్‌కుమార్ నటించిన 'ఖేల్ ఖేల్ మే', జాన్ అబ్రహం ప్రధాన పాత్ర పోషించిన 'వేదా'. వీటి కంటే ఒక రోజు ముందే రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ నటించిన 'స్త్రీ 2' రిలీజ్ అవుతోంది. ఈ మూడు చిత్రాల్లో మొదటి నుంచీ 'స్త్రీ 2' చిత్రం మీద ఎవరికీ అంచనాలు లేవు. దీనికి ప్రధాన కారణం హీరోయిన్ శ్రద్ధా కపూర్‌కు నాలుగేళ్లుగా సరైన హిట్ లేకపోవడం. అలాగే హీరో రాజ్‌కుమార్ రావుకు ఈ ఏడాది విడుదలవుతున్న మూడో సినిమా ఇది. అతనికి కూడా ఓహో అనిపించే హిట్ పడకపోవడం మరో కారణం. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ నటించిన 'స్త్రీ' చిత్రం 2018లో విడుదలై సూపర్ హిట్ అయింది. అప్పట్లోనే ఈ హారర్ కామెడీ రూ వంద కోట్లు వసూలు చేసింది. సాధారణంగా సీక్వెల్ అనగానే భారీ అంచనాలు ఉండడం సహజం. కానీ 'స్త్రీ' సీక్వెల్‌కు అంత క్రేజ్ రాకపోవడం గమనార్హం. మొదట ఈ సినిమాను కూడా గురువారమే విడుదల చేయాలనుకున్నారు. అప్పటికే రెండు భారీ చిత్రాలు పోటీలో ఉండడంతో భారీ ఓపెనింగ్స్ వస్తే గొప్పే అని అనుకున్నారు .కానీ అనూహ్యంగా గురువారం కు బదులు బుధవారమే సినిమాను విడుదల చేయాలని చివరి క్షణంలో నిర్ణయం తీసుకోవడం "స్త్రీ 2" కు కలసి వచ్చిందని ట్రేడ్ పండితులు అంటున్నారు. సోలో రిలీజ్ కావడంతో మొదటి రోజే రూ పది కోట్లకు పైగా కలెక్ట్ చేస్తుందని ఓ అంచనా.



టికెట్ల అడ్వాన్స్ బుకింగ్ జోరు చూస్తుంటే అంత మొత్తం వసూలు చేయడం ఈజీయే అని ట్రేడ్ పండితులు పేర్కొంటున్నారు. చిన్న చిత్రాల్లో 'గదర్ 2' చిత్రానిదే ఇప్పటివరకూ రికార్డ్. ఆ సినిమా తొలి వారం రూ 40.10 కోట్లు వసూలు చేసింది. ఇప్పుడున్న అడ్వాన్స్ బుకింగ్ ట్రెండ్‌ను పరిశీలిస్తే 'స్త్రీ 2' దానిని అధిగమించి, రూ 50 కోట్లు వసూలు చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇప్పటివరకూ 'స్త్రీ 2' చిత్రానికి సంబంధించి 2.21 లక్షల టికెట్లు అడ్వాన్స్‌గా బుక్ అయ్యాయి. దీని వల్ల రూ. 6.87 కోట్లు వసూలు అయ్యాయి. మహారాష్ట్ర, ఢిల్లీ సర్క్యూట్స్ లోనే అత్యధిక టికెట్లు అమ్ముడవడం విశేషం. ఓపెనింగ్ రోజు థియేటర్ల దగ్గర అమ్మకాలు ఉంటాయి కనుక రూ పది కోట్లు వసూలు చయడం పెద్ద కష్టమేమీ కాదని చెబుతున్నారు. అదే నిజమై 'స్త్రీ 2' తొలి వారం రూ 50 కోట్లు వసూలు చేస్తే హారర్ కామెడీ చిత్రాల్లో ఇదే హయ్యెస్ట్ రికార్డ్ అవుతుంది. ఈ అంకెలు ఎంతవరకూ నిజమవుతాయో కొన్ని గంటల్లో తేలిపోతుంది కనుక వేచి చూద్దాం.

ఆంధ్ర వర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- ఎంబీఏ, ఎంసీఏ ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ మోడ్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించింది. ఏపీఐసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తించదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.

ఎంబీఏ: ఎంబీఏ జనరల్ ప్రోగ్రామ్‌తోపాటు మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హెచ్ ఆర్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హెచ్‌ఆర్ స్పెషలైజేషన్‌లో 66 సీట్లు; మిగిలిన వాటిలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఎంబీఏ(జనరల్, హెచ్‌ఆర్) ప్రోగ్రామ్‌లను ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్ఐబీ); మిగిలిన స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లను ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్(డీసీఎంఎస్) అందిస్తున్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

ఎంసీఏ: ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తోపాటు బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.600
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 17
- **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 19
- **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఏపీ ఐసెట్ 2024 ర్యాంక్ కార్డ్; టీసీ; పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ వరకు స్టడీ సర్టిఫికెట్లు; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు
- **వెబ్‌సైట్:** audoa.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/8tClgiXలో చదవండి.

దిక్సూచి

మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్

కే.సీ.మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్-'మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్'నకు దరఖాస్తులు కోరుతోంది. దీనిని జాబ్ ఓరియంటెడ్ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు చేస్తున్న అభ్యర్థులకు ఆర్థిక సహకారం అందించేందుకు ఉద్దేశించారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. బాలికలకు, అల్పాదాయ కుటుంబాల్లోని పిల్లలకు, దివ్యాంగులకు, సైనిక దళాల్లో పనిచేస్తున్నవారి పిల్లలకు ప్రాధాన్యమిస్తారు. మొత్తం 550 మందికి అవకాశం కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.10,000లు చొప్పున మూడేళ్లు స్కాలర్‌షిప్ అందిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం ఏదేని పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లొమా మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొంది ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** www.kcmet.org

గ్రామాల్లో అభివృద్ధికి బాటలు వేయాలి

● రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు



సమస్యలను వింటున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని, ఏయే సమస్యలు న్నాయో గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రోడ్లు, కాలువల మరమ్మతులు చేపట్టాలన్నారు. అన్ని గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు గ్రూపులు విడనాడి కలిసికట్టుగా పయనించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. యువత కుటీర పరిశ్రమల ద్వారా ఉపాధి పొందాలని, పెదతోవ పట్టవద్దన్నారు. పాడి పరిశ్రమల కోసం రుణాలిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదుగురు యువకులు ఒక గ్రూపుగా ఏర్పడి కోటి రూపాయల పెట్టుబడితో భారీ పారిపరిశ్రమను ఏర్పాటు చేయడం ద్వారా జీవనోపాధి కలుగుతుందన్నారు. ఆ దిశగా యువత అడుగులు వేయాలన్నారు. టెక్కలితో పాటు జిల్లా నుంచి పలువురు నేతలు వచ్చి వినతిపత్రాలు అందించారు.

ఎల్‌ఎన్‌పేటలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయండి

● హోంమంత్రిని కోరిన ఎమ్మెల్యే ఎంజీఆర్



పాతపట్నం: ఎల్ఎన్‌పేట మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను మంగళవారం విశాఖపట్నంలో కలిసి వినతిపత్రం అందించారు. పాతపట్నంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, మెళియాపుట్టి పోలీస్ స్టేషన్‌కు వాహనాల సదుపాయం కల్పించాలని కోరారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో గంజాయి అక్రమ రవాణాను నియంత్రించే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఐదోరోజు కొనసాగిన దువ్వాడ వాణి దీక్ష



టెక్కలి: జడ్పీటీసీ సభ్యురాలు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సతీమణి దువ్వాడ వాణి చేపట్టిన నిరసన దీక్ష మంగళవారం ఐదోరోజూ కొనసాగింది. శ్రీనివాస్ ఇంటి వద్ద చేపట్టిన దీక్ష సమయంలో ఆమె కుమార్తెలు హైందవి, నవీనతో పాటు తండ్రి సంపతిరావు రాఘవరావు, బంధువులు అక్కడే ఉన్నారు. మరోవైపు దువ్వాడ శ్రీనివాస్ అదే భవనం లోపల నుంచి బయటకు రాలేదు. ఇక పోలీసులు బందోబస్తు మాత్రమే కనిపించింది. మీడియా ప్రతినిధులతో మాట్లాడేందుకు దువ్వాడ మంగళవారం ముఖం చాటేశారు. కుటుంబసభ్యులు సోమవారం రాత్రి రాజీకి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

భక్తిశ్రద్ధలతో గ్రామదేవతకు ముర్రాటలు

జగన్నాథకాలనీ(పోలాకి): రాళ్లపాడు పంచాయతీ జగన్నాథ కాలనీలో పాదాలమ్మ తల్లి గ్రామ దేవతకు మంగళవారం స్థానికులతో ఆలయ అర్చకుడు రమణశర్మ భక్తులతో పూజలు చేయించారు. కాలనీ మహిళలు కళశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి ముర్రాటలు పోసి చల్లదనం చేసి పండ్లు, పూలు, వడపప్పు సమర్పించారు. అనంతరం అమ్మవారికి విశేష పుష్పాలంకరణ చేశారు. రాష్ట్ర ఓబీసీ కమిటీ నాయకులు, శ్రీశయన సంఘం ఉపాధ్యక్షుడు తులసిపాటి కృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎంవీనాయుడు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని ఏపీడీ పి.రాధ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలమైనందున గ్రామాల్లో ప్లాంటేషన్, ఫారంపాండ్స్ తదితర పనులు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చర్యలు తీసుకుందన్నారు. దీనిద్వారా వేతనదారులకు ఉపాధి కల్పించాలన్నారు. ఫారంపాండ్స్ వివరాలు ఉపాధి కార్యాలయం రికార్డుల్లో పొందుపరిచి సంబంధిత జిల్లా అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఏపీవో కె. శ్రీదేవి, ఈసీ కె.సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనతో సామాజిక భద్రత

పాతపట్నం: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడం ద్వారా సామాజిక భద్రత కలుగు తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బాలాజీ నగర్‌లో కేఆర్‌పీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లికలు, టైలరింగ్, మగ్గం వర్క్స్, ఎంబ్రాయిడరీ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. వీటిని ఆచరించడం ద్వారా ఉపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ, సంస్థ కార్యదర్శి కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

లంపీస్కిన్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

నందిగాం: పశువుల్లో వ్యాప్తి చెందుతున్న లంపీస్కిన్ వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీ వి. జయరాజ్ అన్నారు. జల్లపల్లిలో పశువులకు సోకిన వ్యాధిని మంగళవారం పరిశీలించారు. శ్రీకాకుళం నుంచి ప్రత్యేక బృందం ద్వారా దూడలకు టీకాలు వేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.బాలకృష్ణ, జె.మోహనరావు, బి.గిరిబాబు, ఎస్.ప్రసాదరావు, సింహాచలం పాల్గొన్నారు.

జాతీయతాభావం పెంపొందాలి

పాతపట్నం: ప్రతి ఒక్కరిలో జాతీయతాభావం పెంపొందాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డా.సలాన శరత్‌కుమార్ అన్నారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు మంగళవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సైలాడ సతీష్, బూరి నరేంద్ర కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, సలాన రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల సమస్యలను పరిష్కరించాలి

● ఎమ్మెల్యే బగ్గుకు సంఘ నేతల వినతి



ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి వినతిపత్రం అందిస్తున్న స్వర్ణకార సంఘ నేతలు

నరసన్నపేట: స్వర్ణకారుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో టీడీపీ హయాంలో స్వర్ణకారుల సంక్షేమ సంఘానికి కేటాయించిన స్థలంలో ఎంపీ నిధులతో భవనం నిర్మాణం చేస్తామని వైసీపీ ప్రభుత్వంలో కొందరు తప్పుడు రికార్డులు సృష్టించి ఆ స్థలాన్ని ప్రైవేటు భూమిగా రికార్డుల్లో మార్పిడి చేసి అన్యాయం చేశారన్నారు. ఈ సమస్యను పరిష్కరించి సహకరించాలని కోరారు. 2014లో ప్రభుత్వ స్థలం 2019 నాటికి ఏ విధంగా ప్రైవేటు స్థలంగా మారిందో విచారణ చేపట్టి న్యాయం చేయాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఏఎస్పీ ప్రేమకాజల్



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రేమ్‌కాజల్

నరసన్నపేట: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ ప్రేమ్‌కాజల్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఓ కల్యాణ మండపంలో పద్మావతి డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచి అవసరాల కోసం వినియోగించుకోవాలన్నారు. లోన్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థినులకు పోలీస్ వ్యవస్థ రక్షణగా ఉంటుందని, అత్యవసర సమయంలో వినియోగించుకోవాలన్నారు. డిగ్రీ స్థాయి నుండే గ్రూప్ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్, దాసునాయుడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణలను సద్వినియోగం చేసుకోండి

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్‌హబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత శిక్షణలను యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డా.శ్రీరాములు ఒక ప్రకటనలో కోరారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, డెబిట్ రికవరీ ఏజెంట్ కోర్సులపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసున్న యువతకు 4నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నామని, దీంతో ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సుకు 10వ తరగతి ఆపైబడిన విద్యార్హత ఉండాలన్నారు. డెబిట్ రికవరీ ఏజెంట్(టెలీ) కోర్సుకు ఇంటర్, బీకాం ఆపై విద్యార్హత కలిగిన వారు అర్హులన్నారు. శిక్షణ అనంతరం జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పించనున్నామన్నారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ పి.అనూష 9553292734 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

స్కిల్ హబ్‌లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులాహ్వానం

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్‌హబ్ ఆధ్వర్యంలో డొమెస్టిక్ డేటాఎంట్రీ ఆపరేటర్, డెబిట్ రికవరీ ఏజెంట్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణనిచ్చేందుకు పీజీ (కంప్యూటర్ ఫైల్డ్), డెబిట్ రికవరీ ఏజెంట్‌కు ఎంకాం లేదా ఎంబీఏ విద్యార్హతుండే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాలుగు నెలల పాటు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 17న ఇంటర్వ్యూ చేపడతామన్నారు. ఇతర వివరాలకు 95532 92734, 81798 20908 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

విలువలతో కూడిన విద్య పెంపొందించుకోవాలి

నందిగాం: విలువలతో కూడిన విద్య, నైపుణ్యతను పెంపొందించుకోవాలని మానసిక వైద్యుడు కె.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నందిగాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో మానసిక ఆరోగ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక స్పృహ, వ్యక్తిత్వం, సాంఘిక అభివృద్ధి తదితర అంశాలపై సూచనలు చేశారు. సమస్యకు ఆత్మహత్య మార్గం కాదని, వాటిని అధిగమించే మార్గం అన్వేషించాలని సూచించారు. ఉపాధ్యాయుల సూచనలను పాటించి విద్యపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నందిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.సుకన్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎన్.వాణి, సీహెచ్‌వో ధాతారాం, హెచ్‌ఏ ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

ఐతం కళాశాలకు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్



మాట్లాడుతున్న డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు

టెక్కలి: భారత ప్రభుత్వ ఉన్నత విద్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే ప్రతిష్ఠాత్మకమైన నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకుల్లో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల (ఐతం)కు ర్యాంక్ వచ్చిందని డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2024 విద్యా సంవత్సరానికి ఉత్తమ ఇంజనీరింగ్ కళాశాలల ర్యాంకింగ్ జాబితాను కేంద్ర ఉన్నత విద్యా శాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విడుదల చేశారన్నారు. ఈ జాబితాలో ఐతం కళాశాలకు స్థానం దక్కిందన్నారు. దేశంలో 201 నుంచి 300 మధ్య ర్యాంక్‌కు కళాశాల ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఈ ర్యాంక్‌కు 13 ఇంజనీరింగ్ కళాశాలలు ఎంపిక కాగా ఉత్తరాంధ్రలో కేవలం మూడు కళాశాలలకు చోటు దక్కిందని, అందులో ఆదిత్య ఒకటి కావడం శుభపరిణామమన్నారు. సమావేశంలో కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, ఐక్యూ ఏసీ డీన్ డాక్టర్ రమేష్, టంకాల నాగేషు, పిరియా రమేష్ పాల్గొన్నారు.

ఆక్రమణల పరిశీలన

టెక్కలి: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు మంగళవారం రెవెన్యూ అధికారులు టెక్కలి మేజర్‌పంచాయతీలో ఆక్రమణలు జరిగిన స్థలాలను పరిశీలించారు. సర్వే నెం.468 కాటాబందలో కుల సంఘాలకు ఇచ్చిన స్థలాలు, శ్మశాన వాటికలు ఆక్రమణలకు గురైనట్లు ఫిర్యాదులు రాగా వాటిని సర్వే సిబ్బంది పరిశీలించారు. జాతీయ రహదారి టెక్కలి-తెంబూరు రోడ్డు వంతెన సమీపంలో అటవీశాఖకు కేటాయించిన సర్వేనెం.489-1ఏ-2బిలో 90 సెంట్ల ఎల్‌సీ ల్యాండ్‌ను పరిశీలించి ఆక్రమణలు ఏ మేరకు జరిగాయో గుర్తించారు. ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని, లేదంటే తామే వాటిని తొలగిస్తామని తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి హెచ్చరించారు. ఎక్కడ రెవెన్యూ స్థలాలు ఆక్రమణలు జరిగినా వాటిని తొలగించి తీరుతామన్నారు.

నైపుణ్య గణన సర్వే విజయవంతం చేయండి

పోలాకి: ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న నైపుణ్య గణన సర్వే విజయవంతం చేయాలని సెర్ప్ ఏరియా కోర్డినేటర్ కె.కొండలరావు అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో గ్రామ వీవోఏలు, సీసీల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వయంశక్తి సంఘాల మహిళలే కాకుండా వారి పిల్లలకు ఉపాధి కల్పించే నిమిత్తం నైపుణ్య గణన సర్వే చేపడుతున్నారన్నారు. మండలంలో 2067 మందికి సర్వే చేపట్టాల్సి ఉండగా ఇప్పటికే 13,924 మందికి సర్వే చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గోరు రాజారావు, గణాంక సర్వే అధికారి నీరజ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ కలలను నెరవేర్చాలి

కాశీబుగ్గ: మహాత్మాగాంధీ కన్న కలలను ప్రతి ఒక్కరు నెరవేరిస్తేనే స్వాతంత్ర్యానికి అర్థం ఉంటుందని పలాస-కాశీబుగ్గ బీజేపీ సభ్యులు వైకుంఠరావు, వైశ్యరాజు రాజులు అన్నారు. మంగళవారం పలాస-కాశీబుగ్గలో మహాత్మాగాంధీ, డాక్టర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు.

గాంధీనగర్‌లో ఆక్రమణల తొలగింపు

● కోర్టు ఉత్తర్వులతో స్వాధీనం చేసుకున్న మునిసిపాలిటీ



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

పలాస, ఆగస్టు 13: కాశీబుగ్గ గాంధీనగర్‌లో 40 అడుగుల రోడ్డులో సుమారు 2వేల చదరపు అడుగుల స్థలాన్ని కోర్టు తీర్పుతో మునిసిపాలిటీ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. సదరు స్థలాన్ని ఓ వ్యాపారి ఆక్రమించుకుని తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేశారు. దీనిపై గతంలో పలాస మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో మునిసిపాలి, సదరు వ్యాపారి మధ్య వివాదం నడిచింది. ఈ నేపథ్యంలో మూడు రోజుల కిందట సదరు స్థలం మునిసిపాలిటీకి చెందుతుందని కోర్టు తీర్పు నివ్వగా ఆ ఉత్తర్వులు మునిసిపల్ అధికారులకు మంగళవారం చేరాయి. దీంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఆక్రమణలను ఎక్స్‌కవేటర్ల సాయంతో తొలగించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దీంతో స్థానికుల్లో హర్షాతికాలు వ్యక్తమవుతున్నాయి. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో 40 అడుగుల రోడ్డు ఉన్న మార్గం ఇదే కావడంతో పలు వ్యాపార సంస్థలు, బ్యాంకులు, పాఠశాలలు, ఆసుపత్రులు వెలిశాయి. దీంతో ఈ మార్గంలో స్థలాల ధరలు పెరిగాయి. సదరు వ్యాపారి కేటీ రోడ్డును కలిపే ప్రాంతంలో రోడ్డుకు మా తాతల నాడు స్థలాన్ని ఇచ్చారని, ఇది తమకే చెందుతుందని కోర్టును ఆశ్రయించారు. ఈ స్థలంలో తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేసి నెల నెలా రూ.30 వేల అద్దెను పొందుతున్నారు. ఎట్టకేలకు ఈ స్థలం విషయంలో మునిసిపాలిటీకి అనుకూలంగా తీర్పు వెలువడడంతో దుకాణాల తొలగింపు ప్రక్రియ పూర్తయింది. దీనిపై కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ.. గాంధీ నగర్ రోడ్డు ప్రజల ఆస్తి అని, దీనిపై కోర్టు తీర్పు సానుకూలంగా రావడం శుభపరిణామమన్నారు. ఇప్పటికే వివాదాస్పద స్థలం మినహా రోడ్డంతా పూర్తయిందని, మిగిలిన పనిని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్‌అదాలత్

● జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రసన్నలత

కోటబొమ్మాళి: జాతీయ లోక్‌అదాలత్‌ను సెప్టెంబరు 14న నిర్వహించనున్నందున, ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఆర్ఎం ప్రసన్నలత అన్నారు. మంగళవారం కోర్టులో న్యాయవాదులు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్, భార్యాభర్తల కేసులు, వరకట్న నిషేధ కేసులు లాంటివి గుర్తించి రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసులు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.



చిన్నారులకు స్వీట్లు పంచుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత

దివ్యాంగ పిల్లలను బాధ్యతగా సంరక్షించాలి

జలుమూరు: దివ్యాంగ పిల్లలను తల్లిదండ్రులు బాధ్యతగా సంరక్షణ చేయాలని కోటబొమ్మాళి జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్‌ప్రసన్నలత అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను దివ్యాంగులకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం దివ్యాంగుల పిల్లలకు మిఠాయి పంచిపెట్టారు. కేజీబీవీని సందర్శించి వంటలను, భోజన సదుపాయాలను పరిశీలించారు. మరుగుదొడ్లు, వంటశాల పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు బి.మాధవరావు, ప్రసాదరావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ యశోద, హెచ్ఎం మెండ రామారావు తదితరులు పాల్గొన్నారు.

కురిసింది వాన

● వర్షంతో పంటలకు ఊపిరి

● ప్రధాన రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

(మెళియాపుట్టి/పాతపట్నం/పలాస రూరల్/కాశీబుగ్గ)

జిల్లాలో పలు ప్రాంతాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. కొన్నాళ్లుగా వాన కురవకపోవడం, ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో పంట పొలాలు ఎండిపోయే పరిస్థితికి వచ్చాయి. ఎట్టకేలకు చాలా రోజుల తరువాత వర్షం కురవడంతో పంటలకు ఊపిరిపోసినట్లయిందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రధానంగా మెళియాపుట్టి, పాతపట్నం, పలాస, కాశీబుగ్గ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. పలాస నియోజకవర్గంలో 15రోజులుగా వర్షం కోసం ఎదురు చూసిన రైతులకు మంగళవారం రాత్రి 8 గంటల నుంచి సుమారు గంటన్నరపాటు ఏకధాటిగా కురిసిన వర్షం ఆనందం కలిగించిది. అలాగే పట్టణంలో బావులు, బోర్లు ఎండిపోతున్న తరుణంలో కురిసిన వర్షంతో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందని పలువురు పేర్కొన్నారు. కాశీబుగ్గ శ్రీనివాస లాడ్జి ఎదురుగా కన్యకా పరమేశ్వరి ఆలయం రోడ్డులో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



కాశీబుగ్గ శ్రీనివాస లాడ్జి ఎదురుగా రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు





మెళియాపుట్టి, పాతపట్నంలో కురుస్తున్న భారీ వర్షం

హాస్టళ్ల నిర్మాణానికి స్థల సేకరణ పూర్తి

హిరమండలం: మండలానికి మంజూరైన రెండు పీఎం జన్మన్ హాస్టళ్ల నిర్మాణానికి స్థల సేకరణ పూర్తయినట్లు ఎంఈవో కె.రాంబాబు తెలిపారు. మంగళవారం జిల్లా సమగ్ర శిక్షా ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ పూడి జనార్దనరావుతో కలిసి సదరు స్థలాలను పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ సుభలయ పరిధిలో హాస్టల్‌కు స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వం సూచించినప్పటికీ అక్కడ స్థలం లేకపోవడంతో గులుమూరు పరిధిలో 1.20 ఎకరాల భూమిని సేకరించామన్నారు. రెండవ హాస్టల్‌కి సీది పరిధిలో స్థల సేకరణ చేయాల్సి ఉన్నప్పటికీ అక్కడ కూడా ప్రభుత్వ భూమి లేకపోవడంతో గొడియాపాడు సమీపంలో ఎకరా స్థలాన్ని ఎంపిక చేశామన్నారు.

నర్సరీ నుంచి మొక్కలు అందించండి

కాశీబుగ్గ: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న మొక్కల నాటే కార్యక్రమానికి నర్సరీ నుంచి మొక్కలు ఇవ్వాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి మురళీకృష్ణను జనసేన పార్టీ సమన్వయకర్త దుర్గారావు కోరారు. మంగళవారం కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజ్ అధికారిని కలిసి మాట్లాడారు. నియోజకవర్గం పరిధిలో మెండు, రట్టి, బెండికొండ, సూదికొండ, బాలిగాం, మాలతిమట్టు, తర్లాకోట, నరసింగపురం, కిడిసింగి తదితర ప్రాంతాల్లో రిజర్వ్ ఫారెస్ట్ విస్తరించి ఉందన్నారు. అందుబాటులో ఉన్న నర్సరీ దగ్గర నుంచి మొక్కలు అందిస్తామని ఫారెస్ట్ అధికారి తెలిపారన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు

సంతబొమ్మాళి: దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు కోత అప్పన్న, మహలక్ష్మి మెమోరియల్ పురస్కారాలను మంగళవారం అందించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన అప్పిని కీర్తన, ఆలంజంగి షణ్ముఖరావు, కింజరాపు స్వాతిక, లమ్మత భువనకృతి, ఇచ్ఛాపురం పావనికి నగదు పురస్కారం అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోత చైతన్య, సంస్థ అధ్యక్షుడు కోత మధు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

హరిపురం: మందస మండలం హరిపురం రట్టి రోడ్డు సమీపంలో సోమవారం రాత్రి రోడ్డు దాటుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సువర్ణాపురం గ్రామానికి చెందిన చుక్కా రామ్మూర్తి(74) హరిపురం నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతున్న సమయంలో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన రామ్మూర్తిని హరిపురం ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం టెక్కలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మందస ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నాపర్లను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటికి చెందిన బాలుడు కె.విశ్వజిత్ కిడ్నాప్‌కు సంబంధించి ఇద్దరు ఆర్మీ జవాన్లతో పాటు మరో ఇద్దర్ని కోటబొమ్మాళి కోర్టులో మంగళవారం హాజరుపరిచినట్టు ఎస్ఐ పారినాయుడు తెలిపారు. ఆదివారం బాలుడ్ని బత్తిన నాగరాజు, బత్తిన లక్ష్మణరావు, ఉణుకూరు గుణశేఖర్, రేపల్లె పృధ్వీలు ముఠాగా ఏర్పడి డబ్బులు కోసం కిడ్నాప్ చేశారు. దీనిపై పోలీసులు జాగ్రత్త వహించి కిడ్నాపర్లు పరారీ కాకుండా పట్టుకున్నారు. అంతకుముందే వారి మధ్య బేదాభిప్రాయాలు రావడంతో బాలుడ్ని ఎవరూ లేని ప్రదేశంలో విడిచిపెట్టారు. దీనిపై బాధితుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కిడ్నాపర్లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

రణస్థలం/శ్రీకాకుళం క్రైం: జాతీయ రహదారి సత్యసాయి ఆలయం ఎదురుగా మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లావేరు మండలం ఇజ్జాడపాలెం గ్రామానికి చెందిన సన్యాసినాయుడు స్థానిక బీర పరిశ్రమలో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా సత్యసాయి ఆలయం సమీపాన వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో సన్యాసినాయుడి రెండు కాళ్లపై నుంచి లారీ వెళ్లడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

రిమ్స్ వద్ద బంధువుల ఆందోళన

బాధితుడికి చికిత్స అందించడంలో వైద్యులు నిర్లక్ష్యం వహించారంటూ కుటుంబ సభ్యులు, బంధువులు రిమ్స్ అత్యవసర విభాగం వద్ద ఆందోళన చేశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న సన్యాసినాయుడికి చికిత్స అందించేందుకు వైద్య సిబ్బంది ముందుకు రావడం లేదని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. అయితే అంబులెన్స్‌లో ఉన్న క్షతగాత్రుడ్ని ఆసుపత్రి లోపలకి తీసుకువెళ్లే లోపునే అతడి కుటుంబ సభ్యులు ఆందోళన చేశారని, అయినా పూర్తి స్థాయిలో వైద్యం అందిస్తున్నట్టు రిమ్స్ వైద్యులు చెబుతున్నారు. రెండు కాళ్ల పైనుంచి లారీ వెళ్లడంతో తీవ్ర రక్తస్రావం జరిగిందన్నారు. వైద్యుల పర్యవేక్షణలో ప్రస్తుతం చికిత్స అందిస్తున్నామని ఆర్ఎంవో భానుప్రకాష్ తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి: కొత్తూరు గ్రామ పరిధిలో ఎస్ఈబీ సూపరింటెండెంట్ టి.తిరుపతిరావు ఆదేశాల మేరకు ఎస్ఈబీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 1200 లీటర్ల బెల్లం ఊటలను, 20 లీటర్ల సారా ధ్వంసం చేశారు. కేసు నమోదు చేసినట్టు టెక్కలి ఎస్ఈబీ సీఐ జీఎస్ రాజశేఖర్ తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

శ్రీకాకుళం రూరల్: చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శ్రీకాకుళం సీఐ కె.పైడిపునాయుడు విద్యార్థులకు సూచించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు.. నైరాలో గల ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులకు ఆయన మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ర్యాగింగ్, సైబర్ మోసాలు, మహిళా రక్షణ, భద్రత, ట్రాఫిక్ నియమాలను వివరించారు. అందరూ హెల్మెట్ ధరించాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మైనర్లు వాహనాలు నడపరాదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ వాసు నారాయణ, కె.వెంకటేష్, మహిళా ఎస్ఐ రేవతి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం సరిచేశారు

గార: హుకుంపేట వెళ్లే దారిలో రోడ్డు పక్కన వాలిపోయి ఉన్న విద్యుత్ స్తంభాన్ని మంగళవారం ఆ శాఖ సిబ్బంది సరిచేశారు. 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం వచ్చిన కథనానికి స్పందించిన విద్యుత్ ఏఈ ఎల్.పవనమూర్తి ఆధ్వర్యంలో లైన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.గోపి, ఇతర సిబ్బంది ఈ విద్యుత్ స్తంభాన్ని సరిచేయించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


స్తంభాన్ని సరిచేస్తున్న సిబ్బంది

అంగన్‌వాడీ కేంద్రాలతోనే చిన్నారుల భవిష్యత్

కంచిలి: అంగన్‌వాడీ కేంద్రాలతోనే చిన్నారుల భవిష్యత్ ముడిపడి ఉందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు ప్రాంగణంలో మొక్కలు నాటారు. క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, పీవో సీహెచ్ ఇందిర, ఏసీడీపీవో గోవిందరాజులమ్మ, కూటమి నాయకులు బంగారు కురయ్య, మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, తమరాల శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బొల్లినేని విద్యార్థుల ప్రతిభ


రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: బీఎస్సీ పారామెడికల్ ఫలితాల్లో బొల్లినేని మెడిస్కిల్స్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఈ ఫలితాల్లో ఆప్టోమెట్రీ విభాగంలో వి.చిన్మయి, ఇమేజింగ్ టెక్నాలజీ విభాగంలో పి.లీలా మాధవి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకులు సాధించారన్నారు. అనస్తీషియా విభాగంలో పి.గీతిక రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు, పెర్ఫ్యూజన్ విభాగంలో ఎం.శ్రావ్యశ్రీ 5వ ర్యాంకు, డయాలసిస్ విభాగంలో వై.సుష్మ బానోజీ 5వ ర్యాంకు సాధించారన్నారు. అత్యుత్తమ బోధన, నిరంతర పర్యవేక్షణతో ఈ ఫలితాలు సాధించామని తెలిపారు. ఏటా తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం ఈ ఏడాది కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి పద్మజ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

జి.సిగడాం: వాహనచోదకులు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వై.మధుసూధనరావు హెచ్చరించారు. మంగళవారం మెట్టవలస, పాలఖండ్యాం కూడళ్ల వద్ద వాహనచోదకులకు అవగాహన కల్పించారు. మైనర్లు డ్రైవింగ్ చేయడం, లైసెన్సు లేకుండా వాహనాన్ని నడపడం నేరమన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. నిబంధలకు విరుద్ధంగా వాహనాన్ని నడిపితే జరిమానాతోపాటు శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది, వాహనచోదకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

ఆమదాలవలస: రైతులందరూ తమ పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఏవో మెట్ట మోహన్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని సైలాడ టి.జొన్నవలస సచివాలయాలను వాటి పరిధిలోని పంట పొలాలను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. రైతులు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు రాయితీలు పొందాలన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా

● జాతీయ జెండాలతో ర్యాలీ

శ్రీకాకుళం కల్చరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం మంగళవారం జిల్లాలో సందడిగా జరిగింది. బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో తిరంగా ర్యాలీ చేపట్టారు. వెయ్యి జాతీయ జెండాలు విద్యార్థులకు పంచిపెట్టారు. ప్రతీ ఒక్కరూ తమ ఇంటిపై తల్లిదండ్రులతో కలిసి జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఉమెన్స్ కళాశాల నుంచి సూర్యమహల్ జంక్షన్, ఏడు రోడ్ల కూడలి వరకు.. అక్కడి నుంచి తిరిగి సూర్యమహల్ జంక్షన్ వరకు తిరంగ్ ర్యాలీ చేపట్టారు. అక్కడ మానవ హారంగా నిలబడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు బూరె నరేంద్ర చక్రవర్తి, నాయకులు పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలరావు, అట్టాడ రవి బాబ్జీ, చల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం కల్చరల్: సూర్యమహల్ జంక్షన్‌లో జాతీయ జెండాలతో మానవహారం

● **ఇచ్ఛాపురం:** బిర్లంగి గ్రామంలో బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంగి లక్ష్మి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న జాతీయ నాయకుల విగ్రహాల వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించి విగ్రహాలను శుభ్రపరిచి, పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మల్లేశ్వరరావు, తేజేశ్వరరావు, చిన్నమ్మ, సంతు, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

● **రణస్థలం:** ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నె శ్యామ్‌కుమార్ అన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు మంగళవారం జాతీయ రహదారిపై హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమలో నడుకుదిటి తేజ, వెలిచేటి చిన్నమౌళి, రాజాన రమణ, తదితరులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం


రణస్థలం: జాతీయ జెండాలతో ర్యాలీగా..

పార్టీలకు అతీతంగా పనిచేద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

లావేరు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పార్టీలకు అతీతంగా పనిచేద్దామని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషరిత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడా కూడా పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. మునుపెన్నడూ లేని విధంగా రాబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రతీ పంచాయతీకి రూ.10 వేలు నుంచి రూ.25 వేల వరకు కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. త్వరలో తోటపల్లి, మద్దువలస సాగునీటి ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందిస్తామన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ.. లావేరులో శిథిలమైన ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలకు నూతన భవనాల మంజూరు చేస్తామని చెప్పారు. ఏవో మహేష్ పనితీరు బాగోలేదని బుడుమూరు సర్పంచ్ చిట్టిబాబు ఆరోపించారు. కాసులు ఇచ్చిన వారికే ఇళ్ల బిల్లులు చెల్లిస్తున్నారంటూ గోవిందపురం సర్పంచ్ పిల్ల రాము డీఈ అప్పారావును నిలదీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.జోగారావు, ఎంపీడీవో కొండలరావు, ఎంపీటీసీ జనసాల భానోజీరావు, జడ్పీటీసీ మీసాల సీతంన్నాయుడు, మండల ప్రత్యేకాహ్వానితులు రొక్కం బాలకృష్ణ, కూటమి నాయకులు ముప్పిడి సురేష్, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఉపాధి హామీ పథకం సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది వెంకటరమణ, గౌరినాయుడు, ప్రసాద్, శ్యామలరావు, రామసత్యం తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు అండగా ఉంటా

అరసవల్లి: స్వచ్ఛంద సంస్థల సేవలు వెలకట్టలేనివని, మానవ సేవే మాధవ సేవ అని నిరూపిస్తున్నారని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులగల ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో యునైటెడ్ ఎన్జీవో ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆటలాడుకునే వయసులో చిన్నారులు ఈ వ్యాధికి గురై పడుతున్న బాధలు వర్ణనాతీతమన్నారు. తలసేమియా చిన్నారులకు రిమ్స్‌లో సదరం సర్టిఫికెట్లు ఇవ్వడంలో జాప్యం జరుగుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, రిమ్స్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు, టీడీపీ నాయకులు, ఎన్జీవో ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


పౌష్టికాహారం అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అరసవల్లి: ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ఔట్ సోర్సింగ్ రాష్ట్ర కమిటీ నాయకులు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.బ్రహ్మానందరెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఇప్పటికీ ఈ ఉద్యోగులు థర్డ్‌పార్టీ విధానంలో పనిచేస్తున్నారని, కాంట్రాక్టర్లు దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్కాట్ గజపతి, జనరల్ సెక్రటరీ భుక్యా కుమార్ నాయక్, తమ్మిశెట్టి గంగాంజనేయులు, పినపాటి సుధీర్ కుమార్, అభిమళ్ల హరిప్రసాద్ , అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.


ఈడీకి వినతిపత్రాన్ని ఇస్తున్న దృశ్యం

వైసీపీ హయాంలోనే బీసీలపై దాడులు: కలమట


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట

అరసవలి: గత వైసీపీ ప్రభుత్వంలోనే బీసీలపై దాడులు జరిగాయని, ఇది రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంటరమణ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి జోగి రమేష్ దొడ్డిదారిలో కొడుకు, సోదరుచిట పేరుమీద భూములు రిజిస్ట్రేషన్ చేయించుకుని అనంతరం బీసీలపై కక్షసాధింపు చర్యలంటూ విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, ఇప్పటికైనా వైసీపీ నాయకులు ఆత్మవిమర్శ చేసుకుని తమ తప్పులను సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తే బాగుంటుందని హితవు పలికారు. బీసీ నేతలు అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు, కొల్లు రవీంద్ర, కూన రవికుమార్, నాపైన అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టినప్పుడు జోగి రమేష్‌కు బీసీలు కనిపించలేదా అంటూ ప్రశ్నించారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, పార్టీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నాయకులు ఎస్వీ రమణ మాదిగ, కొమ్మనాపల్లి వెంకట రామరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త మత్స్యలేశంలో వైరల్ జ్వరాలు

ఎచ్చెర్ల: డి.మత్స్యలేశం పంచాయతీ కొత్త మత్స్యలేశం గ్రామంలో వైరల్ జ్వరాలతో 18 మంది బాధపడుతున్నారు. వీరిలో ఇద్దరు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో తాగునీటి బోర్లు వద్ద పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా ఉండడంతో ఈ పరిస్థితి నెలకొంది. తాగునీటి బోర్ల వద్ద మురికినీరు నిల్వ, అక్కడే బట్టలు తడపడం తదితర కారణాలతో అపరిశుభ్ర పరిస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పొన్నాడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మంగళవారం గ్రామంలో ఇంటింటా సర్వే చేపట్టి జ్వరపీడితులకు చికిత్స అందించారు. డీపీవో వెంకటేశ్వరరావు, ఎంపీడీవో రమాదేవిలు గ్రామాన్ని సందర్శించి వైద్య సిబ్బంది అందుబాటులో ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపర్చాలని సూచించారు.


వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు, ఎంపీడీవో రమాదేవి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సరుబుజ్జిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిషారహిత భారత దేశం కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ ఎం.నాగేంద్ర ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో రమేష్ సాహు, అధ్యాపకులు ఆకెళ్ల రామారావు, శ్రీనివాసరావు, విజయ, వినోద్ రాజు, గౌతమీ, సంగీత, విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్

దేశ ఐక్యతను చాటి చెప్పాలి

శ్రీకాకుళం కల్చరల్: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ ఐక్యతను చాటి చెప్పాలని ఎస్బీఐ రీజనల్ మేనేజర్ అబ్దుల్ హాసిబ్ పిలుపునిచ్చారు. మంగళవారం జీటీ రోడ్డులో గల ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్‌లో చీఫ్ మేనేజర్ ఎ.ప్రసాద్ ఆధ్వర్యంలో స్వాతంత్రోద్యమ ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్ఎం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది ప్రాణాలర్పించారన్నారు. వారిని గౌరవిస్తూ బ్యాంకు ఖాతాదారులు, ఉద్యోగులు తమ ఇంటిపై ఈ నెల 15న జాతీయ జెండాను ఎగరవేయాలని కోరారు. ఫొటో ఎగ్జిబిషన్ ఈ నెల 14వ తేదీ వరకు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్బీఐ ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు. అనంతరం పీహెచ్‌కే దాస్, రిటైర్డు సైనికుడు టి.అప్పన్నను సన్మానించారు.


సన్మానిస్తున్న దృశ్యం

అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ విజేత ఇచ్ఛాపురం


ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం: స్థానిక సురంగి రాజా మైదానంలో గత 15రోజులుగా జరుగుతున్న ఇంటర్ స్టేట్ క్రికెట్ టోర్నీ పోటీలు ఉత్కంఠగా సాగాయి. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఇచ్ఛాపురం-భువనేశ్వరం జట్టు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇచ్ఛాపురం ఐసీసీ జట్టు నిర్ణీత 20 ఓవర్లులో ఐదు వికెట్లు కోల్పోయి 193పరుగుల చేసింది. సాద్విక్ 35 బంతుల్లోనే 72పరుగులు చేశారు. అనంతరం 194 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన భువనేశ్వర్ జట్టు 11.2 ఓవర్లు అయ్యే సరికి 87పరుగుల చేసి నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ సమయంలో వర్షం పడడంతో మ్యాచ్‌ను నిలిపి వేశారు. డీఎల్ఎస్(డక్‌వర్త్ లూయిస్ సిస్టమ్) ద్వారా ఇచ్ఛాపురం ఐసీపీ జట్టు విజేతగా ప్రకటించారు. విజేత జట్టుకు రూ 40వేలుతో పాటు ట్రోఫీని, రన్నరప్ భువనేశ్వర్ జట్టుకు రూ.30 వేలుతో పాటు ట్రోఫీని ఎమ్మెల్యే బెందాళం అశోక్ చేతులు మీదుగా ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఐసీసీ క్లబ్ గౌరవ అధ్యక్షుడు దాసరి రాజు, జిల్లా క్రికెట్ సంఘ మెంటార్ ఇలియాస్ అహ్మద్, జిల్లా క్రికెట్ సంఘ సభ్యులు శైలని, బెనర్జీ, ఎం.వెంకటరమణ, బి.తవిటయ్య బి.వెంకటరమణ, బి.నాగరాజు, కోచ్ గోపి, ఈశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నినాదాలు చేయొద్దు

ఇచ్ఛాపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజకీయ నినాదాలు చేయొద్దని టీడీపీ నాయకుడు దొడ్ల గిరీష్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బెల్లుపడ త్రినాథపేటలో ఉండే అంబేడ్కర్ విగ్రహం వద్దకు సోమవారం వైసీపీ నాయకులు, మంగళవారం బీజేపీ నాయకులు వచ్చి రాజకీయ నినాదాలు చేయడం సమంజసం కాదన్నారు. అంబేడ్కర్ ఆశయాలు ఆయన త్యాగాలు మర్చిపోయి బావితరాలకు అంబేడ్కర్ విగ్రహం అంటే ఏదో రాజకీయ స్వలాభాల కోసం వినియోగించుకునే స్థలంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

చెత్తనుంచి సంపద సృష్టించాలి

జి.సిగడాం: చెత్త నుంచి సంపద కేంద్రాలు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.వెంకన్నబాబు అన్నారు. గ్రామాభివృద్ధి ప్రణాళికా శిక్షణ మంగళవారం ఎందువ గ్రామంలో చెత్తనుంచి సంపద కేంద్రం వద్ద సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో సేకరించిన తడిచెత్త, పొడి చెత్తలను వేరువేరుగా వేయాలన్నారు. వీటిద్వారా సంపదను సృష్టించవచ్చన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఎస్.శ్రీనివాసులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ఆదిత్యుని హుండీల లెక్కింపు

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవస్థానం హుండీలను ఈ నెల 14న లెక్కించనున్నట్టు ఈవో ఎస్.చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.00 గంటలకు దేవదాయశాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, పాలకమండలి సభ్యులు, అర్చకులు, భక్తులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను తెరవనున్నట్టు చెప్పారు.

ఖాళీల భర్తీకి నేరుగా ప్రవేశాలు

ఎచ్చెర్ల: దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో ఐదోతరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి బుధవారం నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ఎస్సీ ఐదు సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో ఎస్సీ, ఓసీలకు చెరొకటి, బైపీసీలో ఎస్టీలకు మూడు సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి, రిజర్వేషన్ ప్రాప్తికి నేరుగా సంప్రదించాలన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి నిధులు

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఐదు కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్టు స్థానిక టీడీపీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. సుమారు 40 ఏళ్ల కిందట ఆమదాలవలస పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కలలశాల ఏర్పాటైనా ఇప్పటివరకు పూర్తిస్థాయి అభివృద్ధి జరగలేదని, పట్టణ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచార సమయంలో ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రవికుమార్.. ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రధానమంత్రి ఉచ్చతాశిక్ష అభియాన్ పథకం ద్వారా ఐదు కోట్ల రూపాయలు ఎమ్మెల్యే రవికుమార్ కృషి ఫలితంగా మంజూరు చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో చంద్రబాబుకు లోకేష్‌కు, రవికుమార్‌కు అన్ని వర్గాల ప్రజలు అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఓటర్ల నమోదు

కలెక్టరేట్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి కొత్తగా ఓటర్ల జాబితాలో పేర్ల నమోదుకు ఈ సెప్టెంబరు 30న నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి మంగళవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వచ్చే ఏడాది జనవరి 6వ తేదీన తుది జాబితా ప్రచురిస్తామన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఓటర్ల నమోదు తాజా పరిస్థితిని వివరించారు. అనంతరం కలెక్టర్ ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో మాట్లాడుతూ బీఎల్‌వోలు ఈ నెల 20 నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు ఇంటింటా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో అప్పారావు, ఆర్డీవోలు సీహెచ్ రంగయ్య, భరత్ నాయక్, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, సుదర్శన దొర, ఆర్వోలు లక్ష్మణమూర్తి, రామ్మోహనరావు, సీ-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

ధైర్యలక్ష్మిగా విజయదుర్గమ్మ


అలంకరణలో దుర్గమ్మ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాలవారి వీధిలో ఉన్న విజయదుర్గ ఆలయంలో అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని ధైర్యలక్ష్మిగా అలంకరించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే సంతోషిమాత ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారికి సుప్రభాత సేవ, పాలాభిషేకం నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా పూజలు చేశారు.

రైతుల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

సరుబుజ్జిలి: రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, సలంత్రి ఎంపీటీసీ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. మంగళవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ శిబిరంలో పశువులకు సంబంధించిన వివిధ వ్యాధులకు చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆర్వీ రమణమూర్తి, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ బత్తిన వరలక్ష్మి, గౌరినాయుడు, మాజీ పీఏసీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, పశువైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఎచ్చెర్ల: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండొచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. పొన్నాడ, మురపాక, రణస్థలం కేజీబీవీలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య నిర్వహణపై ఆరా తీశారు. తరగతి గదులు, డైనింగ్ హాల్, వంటగదిని పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు, బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.


పొన్నాడ కేజీబీవీలో పరిశీలిస్తున్న న్యాయాధికారి సన్యాసినాయుడు